## ఇరువది అయిదవరోజు పారాయణము

### ఏకోన వింశత్యధ్యాయః

పృధువు అడుగుతున్నాడు: 'నారదా! నీచే అత్యద్భుతంగా చెప్పబడిన తులసీ మహాత్మ్యాన్ని విని ధన్యుడనైనాను. అదే విధంగా - కార్తీక వ్రతాచరణా ఫలితాలను కూడా ఎంతో చక్కగా చెప్పావు. అయితే, గతంలో ఈ వ్రతం ఎవరెవరి చేత ఎలా ఆచరించబడిందో కూడా విస్తరంగా తెలియజేయి' అని కోరగానే, నారదుడిలా వినిపించసాగాడు.

### ధర్మదత్తోపాఖ్యానము

చాలా కాలం పూర్వం సహ్య పర్వతభూమిని - కరవీరమనే ఊరుండేది. ఆ ఊళ్లో ధర్మవేత్త, నిరంతర హరి పూజాసక్తుడు, నిత్య ద్వాదశాక్షరీ జపవ్రతుడు అతిథి సేవాపరాయణుడూయైన ధర్మదత్తుడనే బ్రాహ్మణుడు వుండేవాడు.

ఒకానొక కార్తీక మాసంలో ఆ విప్రుడు విష్ణుజాగరణ చేయదలచిన వాడై తెల్లవారు ఝామునే లేచి పూజోపకరణాలు సమకూర్చుకుని విష్ణ్వాలయానికి బయలుదేరాడు. ఆ దారిలో వంకరలు తిరిగి ఘోర దంష్ట్రలూ, పాటిస్తూన్న నాలుకా, ఎర్రటికళ్లూ, దళసరిపాటి పెదాలూ, మాంసరహితమయిన శరీరమూ గలదీ, పందివలె ఘుర్ఘుస్తున్నదీ అయిన ఒక దిగంబర రాక్షసి తారసపడింది. దానిని చూసి భీతి చెందిన ఆ బ్రాహ్మణుడు హరిస్మరణతో తులసీభరితమైన జలతాడనం చేయడం వలన, ఆ నీళ్లు సోకగానే దాని పాపాలన్నీ పటాపంచలై పోతాయి. తద్వారా ఏర్పడిన జ్ఞానం వలన 'కలహ' అనబడే ఆ రాక్షసి ఆ బ్రాహ్మణునకు సాష్టాంగంగా ప్రణమిల్లి - తన పూర్వ జన్మ కర్మ విపాకాన్నిలా విన్నవించసాగింది. 'కలహ' చెబుతోంది - పుణ్యమూర్తివైన ఓ బ్రాహ్మణుడా! పూర్వములో నేను సౌరాష్ట్ర దేశమందలి భిక్షుడనే బ్రాహ్మణుని భార్యను. అప్పుడు మిక్కిలి కఠినురాలినై వుంటూ కలహ అనే పేరుతో పిలువబడే దానిని. నేనేనాడూ నా భర్త ఆజ్ఞలను పాటించి ఎరుగను. ఆయన హితవును ఆలకించేదానిని గాను. నేనలా కలహకారిణై అహంకరించి వుండటం వలన కొన్నాళ్లకు, నాథుని మనసు విరిగి మారుమనువాడాలనే కోరికతో వుండేవాడు. ఆయనను నేను సుఖపెట్టలేకపోయినా, మారు మనువు చేసుకోవాలనే ఆయన కోరికను గుర్తించి, భరించలేక విషం తాగి చనిపోయాను.

యమదూతలు నన్ను తీసుకు వెళ్లి యముడి ముందు నిలబెట్టారు. యముడు చిత్రగుప్తుడిని చూసి, 'చిత్రగుప్తా! దీని కర్మకాండలను తెలియజేయి. శుభమైనా,

అశుభమైనా సరే, కర్మఫలాన్ని అనుభవించవలసినదే'నన్నాడు. అందు మీదట చిత్రగుప్తుడు, ఓ ధర్మరాజా! ఇది ఒక మంచి పని కూడా చేయలేదు. తాను షడ్రసోపేతంగా భోజనం చేసిన తరువాత కూడా, భర్తకు అన్నము పెట్టేది కాదు. అందువల్ల మేక జన్మమెత్తి బాధిష్ఠయగు గాక! నిత్యమూ భర్తతో కలహించి అతని మనసుకు బాధ కలిగించినందుకు గాను పురుగై పుట్టుగాక! వండిన వంటను తానొక్కతే తినిన పాపానికిగాను పిల్లిగా పుట్టి తన పిల్లలను తనే తినుగాక! భర్తృద్వేషిణియై ఆత్మహత్య చేసుకున్నందు వలన అత్యంత నిందితమైన ప్రేత శరీరాన్ని పొందుగాక! ఇది ప్రేతరూపమును పొంది కొన్నాళ్లు నిర్జల స్థానంలో వుండి, అనంతరం, సత్కార్యముల నాచరించుగాక!' అని తీర్మానించాడు.

అది మొదలుగా ఓ ధర్మదత్తా! నేను అయిదువందల సంవత్సరాల పాటు ఈ ప్రేత శరీరం ధరించి ఆకలి దప్పులతో అల్లాడుతూ అలనాటి నా పాపాలకై దుఃఖిస్తున్నాను. అనంతరం కృష్ణా, సరస్వతి సంగమ స్థానమైన దక్షిణ దేశానికి రాగా - అక్కడి శివగణాలు నన్ను తరిమికొట్టగా ఇలా వచ్చాను. పరమ పావనమైన తులసి జలాలతో నీవు తాడించడం వలన ఈపాటి పూర్వస్మృతి కలిగింది. పుణ్యతేజస్వివైన నీ దర్శనం లభించింది. కాబట్టి కళంకరహితుడవైన భూసురుడా! ఈ ప్రేత శరీరం నుంచీ, దీని తదుపరి ఎత్తవలసిన యోనులలోని జన్మ త్రయాన్నుంచీ, నాకెలా ముక్తి లభిస్తుందో చెప్పి రక్షించు - అని ప్రాధేయపడింది. కలహ చెప్పినదంతా విని కలతపడిన మనస్సు గలవాడైన ఆ విప్రుడు సుదీర్ఘ సమయం యోచించి, యోచించి దుఃఖభార హృదయుడై ఇలా చెప్పసాగాడు.

## వింశత్యధ్యాయము

ధర్మదత్తుడు చెబుతున్నాడు: 'ఓ కలహా! తీర్థాలూ, దానాలు వ్రతాలూ చేయడం వలన పాపాలు నశించిపోతాయి. కాని నీ ప్రేత శరీరం వలన వాటిని ఆచరించేందుకు నీకు అధికారం లేదు. అదీగాక మూడు యోనులలో మూడు జన్మలలో అనుభవించ వలసిన కర్మపరిపాకం స్వల్ప పుణ్యాలతో తీరదు. అందువలన నేను పుట్టి బుద్ధెరిగిన నాటి నుండి ఆచరిస్తూ వున్న కార్తీక వ్రత పుణ్యంలో సగభాగాన్ని నీకు ధారపోస్తాను. తద్వారా నీవు తరించి ముక్తిని పొందు.' ఈ విధంగా చెప్పి ద్వాదశాక్షరీ మంత్రయుక్తంగా తులసీతోయాలతో ఆమెనభిషేకించి, కార్తీక వ్రత పుణ్యాన్ని ధారపోశాడు. ఉత్తరక్షణంలోనే కలహ-ప్రేత శరీరాన్ని విడిచి, దివ్యరూపిణియై, అగ్నిశిఖవలె లక్ష్మీకళతో ప్రకాశించింది. అమితానందంతో ఆమె ధర్మదత్తునికి కృతజ్ఞతలు చెప్పుకుంటూ వుండగానే,

విష్ణుస్వరూపులైన పార్షదులు ఆకాశం నుంచి విమానంతో సహా వచ్చారు. వారిలోని పుణ్యశీల, సుశీల అనే ద్వారపాలకుల చేత కలహ విమానమందాసీనగా, చేయబడి అప్సరోగణాల చేత సేవించబడసాగింది. ఆ విమానాన్ని చూస్తూనే అందులోని విష్ణుగణాలకు సాష్టాంగపడ్డాడు ధర్మదత్తుడు. సుశీలా పుణ్యశీలులిద్దరూ అతనిని లేవదీసి, సంతసం కలిగించే విధంగా ఇలా చెప్పసాగారు.

'ఓ విష్ణుభక్తా! దీనుల యందు దయాబుద్ధి గలవాడవూ, ధర్మవిదుడవూ, విష్ణుభక్తుడవూ, అయిన నీవు అత్యంత యోగ్యుడవు. లోకోత్తరమైన కార్తీక వ్రత పుణ్యాన్ని ఒక దీనురాలి కోసం త్యాగం చేయడం వలన - నీ నూరు జన్మలలోని పాపాలు యావత్తూ సర్వనాశనమై పోయాయి. ఈమె పూర్వ సంచితమంతా నీచే చేయించబడిన స్నానఫలం వలన తొలగిపోయింది. విష్ణుజాగరణ ఫలంగా విమానం తేబడింది. నీవామెకు అర్పించిన దీపదాన పుణ్యం వలన తేజోరూపాన్ని తులసీ పూజాదుల వలన విష్ణు సాన్నిధ్యాన్నీ ఆమె పొందబోతోంది. ఓ పవిత్ర చరిత్రుడా ! మానవులకు మాధవ సేవ వలన కలుగని మనోవాంఛిత మంటూ యేదీ లేదు. విష్ణుధ్యాన తత్పరుడవైన నీవు ఇద్దరు భార్యలతోనూ కలసి అనేక వేల సంవత్సరాలపాటు విష్ణు సాన్నిధ్యంలో వినోదించగలవు.

## ధర్మదత్తునికి విష్ణుదూతల వరం

విష్ణుదూతలు చెబుతున్నారు: ఓ ధర్మదత్తుడా! వైకుంఠంలో నీ పుణ్యఫలాను భవానంతరం తిరిగి భూలోకంలోని సూర్యవంశంలో దశరథుడనే మహారాజుగా పుడతావు. నీ భార్యలిద్దరూ ఆ జన్మలో కూడా నీకు భార్యలవుతారు. ఇప్పుడు నీచే పుణ్యాభిషిక్తయైన ఈ 'కలహ' యే నీకా జన్మలో మూడవ భార్యగా పరిణమిస్తుంది. దివ్యకార్యార్థమై భూమిని అవతరించనున్న విష్ణువు ఆ పుట్టుకలో నీ కుమారుడుగా జన్మిస్తాడు. ఓ ధాత్రీ సురవరేణ్యా! విష్ణువునకు అత్యంత ప్రీతికరమైన ఈ కార్తీక వ్రతంతో సమానమయిన యజ్ఞయాగాదులుగాని, దానతీర్థాలుగాని లేవని తెలుసుకో. అంతటి మహోత్కృష్టమైనదీ, నీచే ఆచరించబడినదీయైన ఈ కార్తీక వ్రతంలోని కేవలం సగభాగపు పుణ్యానికే ఈ స్త్రీ విష్ణులోకాన్ని పొందుతూ వుంది. ఆమెను ఉద్ధరించాలనే నీ సంకల్పం నెరవేరింది గనుక, నీవు దిగులుడుగవయ్యా అన్నారు విష్ణుదూతలు.

## పందొమ్మిదీ, ఇరువదీ - అధ్యాయములు

## ఇరువది అయిదవ (బహుళ దశమి) రోజు పారాయణము సమాప్తము